సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 9 । మే । 2023



అభయతారకం


విద్యావ్యవస్థలో ప్రభుత్వం మార్పులు ప్రవేశ పెట్టింది. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశించే సమయంలో ఇబ్బంది రాకుండా ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టింది. - 8లో



మూడు టన్నుల చేపలు మృతి

చేపల చెరువులో మూడు టన్నుల వరకు చేపలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో సోమవారం చోటు చేసుకుంది. - 8లో

10,257 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 10,257 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.15 అడుగులకు చేరింది. తాగునీటి అవసరాల కోసం పశ్చిమ డెల్టా కాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

'బులియన్' కోశాధికారిగా అనిల్‌కుమార్ జైన్



అనిల్‌కుమార్ జైన్

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బులియన్ గోల్డ్, సిల్వర్, డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్ కోశాధికారిగా అమలాపురానికి చెందిన జ్యూయలరీ వ్యాపారి అనిల్‌కుమార్ జైన్ నియమితులయ్యారు. ఒంగోలులో రాష్ట్ర బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కోసం ఆదివారం జరిగిన ఎన్నికల్లో అనిల్‌కుమార్ జైన్ రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులో రాష్ట్ర కోశాధికారిగా ఆయన ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయన గతంలో రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి



సరిపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

ఉప్పలగుప్తం: అకాల వర్షాల కారణంగా తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని ఆర్డీవో వసంతరాయుడు అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం తుపాను హెచ్చరికల నేపథ్యంలో కోత కోసిన వరిని రైతులు ఒబ్బిడి చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ కోతలు నిర్వహించని రైతులు వాతావరణం అనుకూలంగా మారే వరకూ వేచి ఉంటే మంచిదని సూచించారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి రవాణా చార్జీలు ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ ఎంఏ షంషి, తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, గెద్దం సురేష్‌బాబు, డీటీ జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ విగ్రహానికి విరాళం



ఎమ్మెల్యే పొన్నాడకు విరాళం అందజేస్తున్న రమేష్‌రాజు

తాళ్లరేవు: ఐ.పోలవరం మండలం ఎదురులంక వారధి వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి ఒక దాత రూ.1.26 లక్షల విరాళాన్ని అందజేశారు. సోమవారం జార్జిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే పొన్నాడకు ఐ.పోలవరం మండలం కొమరగిరి గ్రామానికి చెందిన జంపన రమేష్ రాజు నగదును అందజేశారు.

అమలాపురం డీఎల్‌పీఓగా బొజ్జిరాజు



మల్లికార్జునరావును సత్కరిస్తున్న డీఎల్‌పీఓ బొజ్జిరాజు, కార్యదర్శులు

అమలాపురం రూరల్: అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారిగా పెట్టా బొజ్జిరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై అమలాపురం డీఎల్‌పీఓగా వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీపీఓ కార్యాలయంలో ఆయన జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి సీనియర్ అసిస్టెంట్‌గా, ఈఓపీఆర్డీగా పనిచేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డివిజనల్ పంచాయతీ అధికారిగా అమలాపురం ఈఓపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు పనిచేశారు. ఆయనను డీఎల్‌పీఓ బొజ్జిరాజు, కార్యాలయ ఉద్యోగులు, కార్యదర్శులు సత్కరించారు.

అన్నదాతలకు సర్వేశ్వర్యం



పంట పొలాల్లో సర్వే నిర్వహిస్తోన్న డ్రోన్

- వందేళ్ల తరువాత భూ సమగ్ర సర్వే ప్రక్రియ
- తొలి విడతలో డ్రోన్ల సాయంతో చురుగ్గా పూర్తి
- మిగిలిన ప్రాంతాల్లోనూ వడివడిగా పనులు
- యజమానులకు హక్కుల పత్రాల పంపిణీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గణాంకాలు..

మొత్తం గ్రామాలు	: 1,046
బేస్‌స్టేషన్‌లు	: 10
డ్రోన్‌లు	: 19
రోవర్లు	: 171
డ్రోన్‌లపై సర్వే	: 906
తొలి విడత సర్వే పూర్తయిన గ్రామాలు	: 230
సర్వే బృందాలు	: 575
అవసరమైన సర్వే రాళ్లు	: 3,46,929
యజమానులకు అందజేసిన రాళ్లు	: 86,946
పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలు	: 1,11,037

సాక్షిప్రతినిధి, కాకినాడ: వందేళ్ల తరువాత తొలిసారిగా సమగ్ర భూసర్వే చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం కొత్త అధ్యాయానికి నాంది పలికింది. యజమానులకు భూమిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పత్రాలను చేతుల్లో పెడుతోంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాలకు ఈ పత్రంతో పరిష్కారం దొరికింది. ఎవరి భూమి ఎంత ఉంది, అసలు అది ఎక్కడ ఉంది, ఆక్రమణలకు గురైందా..లాంటి ఆందోళనలతో ఉన్న రైతులకు ఊరట లభిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో సమగ్ర సర్వేను మూడు విడతల్లో చేపడుతున్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందుకు వినియోగిస్తున్నారు. తూర్పుగోదావరి...డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ.. కాకినాడ జిల్లాలలో ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా చేపడుతున్నారు. డ్రోన్ల సాయంతో సరిహద్దులను నిర్ణయించి రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్ల ఇమేజ్‌లను సేకరించి సర్వే ఆఫ్ ఇండియాకు పంపుతున్నారు. అక్కడి నుంచి వచ్చిన ఓఆర్‌ఐ మ్యాప్‌ల ఆధారంగా సర్వే చేస్తున్నారు.

హద్దులు తెలుపుతూ రాళ్ల ఏర్పాటు

గ్రామాల సరిహద్దు నుంచి ఇల్లు, ఖాళీ స్థలాల వరకు ప్రతి అంగుళం విడిచిపెట్టకుండా సర్వే చేపట్టడం విశేషం. ఎన్నో వివాదాలకు చెక్ పెట్టే ఈ సర్వే భావి తరాలకు బంగారమేనని భావించాలి. కొందరు తప్పిదాలతో తలెత్తిన సమస్యలను సర్వేతో చక్కదిద్దుతున్నారు. అంతేకాదు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తున్నారు. దీంతో రైతులు సంతోషం



అలమూరులో భూ హక్కు పత్రాన్ని అందజేస్తోన్న అధికారులు

వ్యక్తం చేస్తున్నారు. సర్వే పూర్తయ్యాక సరిహద్దులు తెలిసేలా రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడతలో మూడు జిల్లాలు కాస్త అటు, ఇటుగా సర్వే లక్ష్యాలను అధిగమించిన జాబితాలో సగర్వంగా చేరాయి. రెండు, మూడు విడతల లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు చురుగ్గా అడుగులు వేస్తున్నారు.

పల్లెల్లో ప్రశాంతత

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నంలో పైలట్ ప్రాజెక్టుగా సమగ్ర భూ సర్వేను అప్పటి రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రారంభించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం నవకండ్రవాడ, కోనసీమ జిల్లా పాలగుమ్మిలో ఈ సర్వేకు శ్రీకారం చుట్టారు. ఏడాదిన్నరగా సర్వే ప్రక్రియను వేగవంతంగా చేపడుతూ రైతులకు ఎంతో



సర్వే బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మేలు చేస్తోంది. మునుపెన్నడూ ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టలేదంటే అతిశయోక్తి కాదు. పల్లెల్లో కక్షలు, కార్పణ్యాలు, కొట్లాటలు అన్నీ భూవివాదాల కారణంగానే తలెత్తేవి. వాటన్నింటికీ ఈ సర్వే పరిష్కారం చూపెడుతోంది. ప్రశాంత వాతావరణానికి దారి చూపుతోంది.

కాకినాడ జిల్లా పిఠాపురం,కోటనందూరు, ప్రత్తిపాడు మండలాల్లో సర్వే ప్రారంభించారు. 413 గ్రామాల్లో 434 మంది సర్వేయర్లు 217 బృందాలుగా ఏర్పడి సర్వే ఈ ప్రక్రియ చేపట్టాయి. మొదటి దశలో 121 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. రెండో విడత కూడా 86 గ్రామాల్లో వచ్చే నెల 30 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. తొలి విడతలో సర్వే పూర్తయిన 121 గ్రామాల్లో 186 123 సర్వే రాళ్లు అవసరం. 39,460 మందికి చెందిన భూముల్లో 1,25,164 సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. సర్వేపూర్తి చేసి వదిలేయకుండా వెంటనే యజమానులకు శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తున్నారు.

కోనసీమ జిల్లాలో అమలాపురం మండలం పాలగుమ్మిలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన దగ్గర నుంచి సర్వే పనులు వేగంగా చేపట్టారు. ప్రస్తుతం మల్కిపురం మండలంలో సర్వే జరుగుతోంది. జిల్లాలో 315 గ్రామాలుంటే 298 చోట్ల డ్రోన్ల సాయంతో సర్వే చేశారు. తొలివిడతలో 137 గ్రామాలలో సర్వే పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే 65 గ్రామాల్లో పూర్తి చేశారు. ఇందులో 122 551 సర్వే రాళ్ల అవసరమని గుర్తించారు. 28,139మంది యజమానులకు చెందిన భూముల్లో 88,324 సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలివిడత 272 గ్రామాలకు గాను 44 గ్రామాల్లో భూ సర్వే పూర్తయ్యింది. ఇక్కడ 72,485 సర్వే రాళ్లు అవసరం. ఇంతవరకు 58,043 సర్వే రాళ్లు వచ్చాయి. వీటిలో 19,347 సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు.

ప్రతి భూమినీ సర్వే చేస్తున్నాం



ప్రతి గ్రామంలో ప్రతి సర్వే నంబర్‌లో ఏ ఒక్క భూమి వదలకుండా సర్వే చేస్తున్నాం. ప్రభుత్వ భూములతో పాటు పోరంబోకు, ప్రైవేటు భూములనే తేడా లేకుండా సర్వే జరుగుతోంది. ఎన్నో ఏళ్లుగా చాలా గ్రామాల్లో భూ వివాదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేతో ఈ వివాదాల పరిష్కారానికి మార్గం లభించింది. దీనిద్వారా అందరికీ న్యాయం జరుగుతుంది. రెండు, మూడు విడతలు కూడా చురుగ్గా జరుగుతోంది.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్, కోనసీమ జిల్లా

సంతోషంగా ఉంది



నాకు రెండెకరాల 40 సెంట్లు భూమి ఉంది. సమగ్ర భూ సర్వే బాగా జరిగింది. గతంలో ఏ ప్రభుత్వం ఈ రకంగా భూములను సర్వే చేసిన సాహసం చేయలేకపోయింది. ఇంత కాలానికి సర్వే చేయడం ద్వారా భూమిపై పూర్తి హక్కులు కల్పించడం సంతోషంగా ఉంది. భూ సరిహద్దు వివాదాలకు భవిష్యత్‌లో అసలు ఆస్కారమే ఉండదు.

– మట్టా రామకృష్ణ, చింతలూరు, ఆలమూరు మండలం.

సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా, డివిజన్, మండల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 230 అర్జీలను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒకసారి సమర్పించిన అర్జీ రీ ఓపెన్ కాకుండా అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మండల ప్రత్యేక అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి అర్జీని సంతృప్తికరంగా పరిష్కరించే దిశగా చర్యలు బలోపేతం చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా వారి పరిధిలోని సచివాలయాల తనిఖీలు నిర్వహించాలన్నారు. అకాల వర్షాలు మూలంగా తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు పూర్తిగా సహాయ సహకారాలు రైతుకు అందించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా డివిజన్, మండల కేంద్రాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా తప్పనిసరిగా బయట తిరిగే సమయాల్లో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రతి అధికారి తమ లాగిన్ లో అప్లోడ్ అయిన అర్జీలను 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కార మార్గాలు చూపాలని, గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారుల అప్రమత్తం కావాలని మండల ప్రత్యేక అధికారులు రోజువారీ అర్జీల పరిష్కార సరళిని పర్యవేక్షిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నా రు. రీ ఓపెన్ అయిన అర్జీలపై సంబంధిత అధికారి స్వయంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. అర్జీదారుని సమక్షంలో చేపట్టిన విచారణ ఫొటోలను అప్లోడ్ చేయాలన్నారు అర్జీలకు వారం లోపల పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



'స్పందన'లో వినతులు తీసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు పొందాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆకాంక్షించారు. టెన్త్‌లో కోనసీమ జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ సత్కరించారు. సఖినేటిపల్లి మండలం మోరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చెల్లుబోయిన యాశ్విత, మండపేట మండలం తాపేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోనాల వెంకట వినయ్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దంగేటి చైతన్య సత్య పదిమ్ని, మండపేట ప్రైవేట్ ఉన్నత పాఠశాల విద్యార్థి పుట్టసాయి శార్వాణి, తాపేశ్వరం ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సంజయ్, ఐశ్వర్యను ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు.



అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

పోలీసు స్పందనకు 33 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక– స్పందన కార్యక్రమానికి 33 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్పందన కార్యక్రమానికి అర్జీదారులు కొందరు తమ కుటుంబీకులతో వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించినవే ఉన్నాయి. అందులో కొన్ని అర్జీలను ఎస్పీ శ్రీధర్ అక్కడికక్కడే పరిష్కరించి ఆయా పోలీసు స్టేషన్ల ఎస్సైలకు ఫోన్లు చేసి ఆదేశాలు ఇచ్చారు. స్పందన కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్, డీసీఆర్బీ ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మండల స్థాయి అధికారులకు కలెక్టర్ శుక్లా ఆదేశం

సాక్షి అమలాపురం: అకాల వర్షాలకు వరి పంట తడిసి దెబ్బతిన్న రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరి పంట రక్షణ, ధాన్యం కొనుగోలు, గృహ నిర్మాణాలు, రీ సర్వే, గర్భిణుల ఆధార్ అప్‌డేట్, ఆరు సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు అంశాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా గర్భిణుల ఆధార్ అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. శాఖల సమన్వయంతో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ఆశించిన స్థాయిలో పురోగతిని సాధించాలని ఆయన స్పష్టం చేశారు. మండల స్థాయి అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడాలని అన్నారు. మండలాల వారీగా వరి విస్తీర్ణం, దెబ్బతిన్న ధాన్యం రాశులు, మొలకలు వచ్చిన ధాన్యం, రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు అంశాలపై పర్యవేక్షించి రైతుకు అండగా నిలవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో 08856–233208 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ సర్వేకు సంబంధించి సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి మే 20వ తేదీ నుంచి మూడోదశ రీ సర్వే ప్రక్రియకు సిద్ధం కావాలన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబుతోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను చేర్పించడంపై దృష్టి

నేడు ఎంఈవోలతో సమావేశం

రాయవరం: ఈ ఏడాది (2023–24) విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం (ఎన్‌రోల్‌మెంట్)పై యాక్షన్ అమలుకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 8 నుంచి 12వ తేదీలోగా డిప్యూటీ డీఈవోలు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలతో డీఈవో/ఏపీసీలు సమావేశం నిర్వహించాలని ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తయిన చిన్నారులను సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం, ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆరో తరగతిలో చేర్పించడం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడు లేదా ఎనిమిదో తరగతి పూర్తి చేసిన వారిని పై తరగతుల్లో చేర్పించడం, పదో తరగతి పూర్తి చేసిన వారిని ప్లస్–2 పాఠశాలల్లో చేర్పించడం ఎన్‌రోల్‌మెంట్ ముఖ్య ఉద్దేశం. మంగళవారం ముమ్మిడివరం ఎమ్మార్సీ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఎంఈవోలు, సైట్ ఇంజినీర్లు, నోడల్ సీఆర్పీలతో సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే సమావేశంలో 12(1)(సి), చదవడం మాకిష్టం, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, జేవీకే డీసీ అప్లోడ్–స్టాక్ రిసీవ్డ్ డిటెయిల్స్, ఓఎస్‌సీ, ట్రాన్సిట్ డీటెయిల్స్, ఎన్‌టీ బుక్స్, శానిటరీ నాప్‌కిన్స్, రాగి మాల్ట్ గ్లాసెస్, సప్లిమెంటరీ పరీక్షలు, యూడైస్ ప్లస్, బైజూస్, నాడు–నేడు ప్రోగ్రెస్‌పై సమీక్ష చేయనున్నారు. ఈ నెల 15–19 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, 22–26 వరకు డేటా కన్సాలిడేషన్ ఆఫ్ అవుట్ గోయింగ్ చిల్డ్రన్స్, 29–జూన్ 2 వరకు కన్సాలిడేషన్ ఆఫ్ డ్రాపవుట్స్, జూన్ 5–9 వరకు స్కూల్ ప్రిపేర్డ్‌నెస్ కార్యక్రమాన్ని అమలు చేయాల్సి ఉంది.

'తూర్పు' రెడ్‌క్రాస్‌కు గవర్నర్ పురస్కారం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లా రెడ్ క్రాస్ శాఖ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్ష హోదాలో కలెక్టర్ మాధవీలత పురస్కారం అందుకున్నారు. సోమవారం విజయవాడ రాజ్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డ్ ప్రదానం జరిగింది. రెడ్ క్రాస్ చెట్టును నాటండి– ఇంటిని రక్షించండి అనే థీమ్‌తో మొక్కల పెంపకంతో పాటు రక్తదాన ప్రచారం వంటి కార్యక్రమాలు మూడేళ్లుగా సేవలందిస్తోందని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు రూ.40 లక్షల మేర విరాళాలు సేకరించగలిగామన్నారు. జిల్లా శాఖ చేసిన సేవలను వివరించారు.

పాలిసెట్‌కు పక్కాగా ఏర్పాట్లు

సాక్షి అమలాపురం: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలు (పాలిసెట్) ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పటిష్టం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు చీఫ్ సూపరింటెండెంట్‌లు పాలిటెక్నిక్ బోర్డు సభ్యులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై డీఆర్వో అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 5,224 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొననున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో రామచంద్రపురంలో ఆరు డివిజన్‌లు, అమలాపురం డివిజన్‌లో 13 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు నియమితులైన అధికారులు ఉదయం ఎనిమిది గంటలకే హాజరై ప్రశ్నాపత్రాలు విభజన వంటి ముందస్తు ప్రక్రియలు 10 గంటల్లోపు పూర్తి చేయాలన్నారు. 11 గంటలకు పరీక్షల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లతో హాజరు కావాలని డీఆర్వో తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. తహసీల్దార్లు, పరీక్షాల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తారన్నారు. పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి సరఫరా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు ఎక్కువగా హాజరయ్యే రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలని, ట్రాన్స్‌కో సిబ్బంది పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను కొనసాగించాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కరోనా ప్రొటోకాల్ పాటిస్తూ ఫస్ట్ ఎయిడ్ మెడిసిన్స్‌తో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. పాలిటెక్నిక్ బోర్డు కన్వీనర్ ఎస్.రామారావు, డీఈవో ఎం.కమలకుమారి, డీపీవో ఎస్.మధుసూదన్, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావు దొర, ట్రాన్స్‌కో ఈ ఈ రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

మహాప్రస్థానం వాహనాన్ని నిర్వహించాలి

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ తరపున ఒక మహాప్రస్థానం వాహనాన్ని డీ ఫ్రీజర్లతో నిర్వహణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు హిమాన్షు శుక్లా రెడ్ క్రాస్ సభ్యులకు సూచించారు. కలెక్టరేట్‌లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెన్రీడ్రు నాట్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద బలహీన వర్గాల వారికి మానవతా సేవలు అందించడంలో రెడ్‌క్రాస్ ముందంజలో ఉండాలని సూచించారు.

జిల్లాలో నిరుపేదల మరణాల సమయంలో మృతదేశాల తరలింపునకు మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయాలనే యోచన ఉందని, వాహనాన్ని కొనుగోలు చేసి రెడ్ క్రాస్ సొసైటీకి నిర్వహణ నిమిత్తం అప్పగిస్తామన్నారు. నిరుపేదలైన వారి నుంచి చార్జీలు వసూలు చేయకుండా మధ్యతరగతి నుంచి నిర్వహణ చార్జీలు వసూలు చేసే దిశగా రెడ్ క్రాస్ సభ్యులు కూడా ఆలోచన చేయాలన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.ఎస్.శర్మ నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో కార్యవర్గం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సభ్యత్వ నమోదు, విపత్తుల సమయంలో చేపట్టిన చర్యలు, మొక్కల పెంపకం, రక్తదాన శిబిరాలు, ఆపద మిత్ర శిక్షణలు, బడ్జెట్ వినియోగం వంటి చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు అవగాహన కల్పించారు. రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఛాయా చిత్ర ప్రదర్శన తిలకించిన మంత్రి విశ్వరూప్



ఛాయాచిత్ర ప్రదర్శనను వీక్షిస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రబీ ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించడంలో జిల్లా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి వివిధ దినపత్రికలలో ప్రచురితమైన కథనాలపై సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తిలకించారు.

అభయతారకం

- వర్రీ తగ్గిస్తున్న మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలు
- ఇటు తెలుగు..అటు ఇంగ్లిష్‌లో ముద్రణ
- ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయుక్తం
- దశల వారీగా 1–9 తరగతులకు



పాఠశాల విద్యార్థులు

రాయవరం: విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు ప్రవేశ పెట్టింది. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పడుతుండడం సహజం. అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టింది. సర్కారు బడుల్లో అంచలంచెలుగా అమలు చేసిన మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలు సత్ఫలితాలిచ్చాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రెండు మాధ్యమాల్లో పాఠ్యాంశాలు ఉండడం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభ్యసన, బోధన సులభంగా మారింది. మిర్రర్ ఇమేజ్‌లో భాగంగా ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లిష్‌లో పాఠ్యాంశాలుండేలా చర్యలు చేపట్టడంతో విద్యార్థులు చదువులో బాగా రాణిస్తున్నారు.

9వ తరగతి వరకు పూర్తి స్థాయిలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిర్రర్ ఇమేజ్ విధానాన్ని పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెట్టారు. 2020 సంవత్సరం నుంచి మిర్రర్ ఇమేజ్ పుస్తకాలను అమల్లోకి తీసుకుని వచ్చి, అంచలంచెలుగా అన్ని తరగతులకు అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు మిర్రర్ ఇమేజ్ పుస్తకాలను అమలు చేస్తుండగా, వచ్చే ఏడాది 10వ తరగతికి కూడా అమలు చేయనున్నారు. తెలుగు మీడియంలో చదివే విద్యార్థులు ఉన్నత విద్యకు వచ్చే సరికి ఇంగ్లీష్ చదువులు లేక ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి.

సులువుగా బోధనాభ్యసం

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఒకటి నుంచి పది, ఇంటర్మీడియెట్ వరకు తెలుగు మీడియంలో చదువుతుంటారు. ఆ తర్వాత డిగ్రీ పూర్తిగా ఇంగ్లిషు మీడియంలో చదవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి. ఇంగ్లిషు భాషలో ఉండే పాఠ్యాంశాలను చదవలేక డిగ్రీ చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. అటువంటి పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలను ప్రవేశ పెట్టింది. చిన్నతనం నుంచే తెలుగు మీడియం చదివే విద్యార్థులు సులువుగా ఇంగ్లిషును అర్థం చేసుకునేలా పాఠ్య పుస్తకాలను ముద్రించింది. ఈ విధానం విద్యార్థుల భవిష్యత్తుకు చాలా ఉపయోగపడుతున్నట్లు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,879 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1.80 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఈ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తోంది.



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు

విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తున్న మిర్రర్ ఇమేజ్ పుస్తకాలకు ఆదరణ పెరిగింది. దశలవారీగా అన్ని తరగతులకు ప్రవేశ పెట్టారు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.



చక్కగా అర్థం చేసుకుంటున్నారు

మిర్రర్ ఇమేజ్ పుస్తకాలతో విద్యార్థులు పాఠ్యాంశాలను చక్కగా అర్థం చేసుకుంటున్నారు. ఇవి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయనడంలో సందేహం లేదు. ఈ పుస్తకాలతో అటు ఉపాధ్యాయులకు బోధన, ఇటు విద్యార్థులకు అభ్యసన సులువుగా ఉంటుంది.

– లంక రాణి, జీహెచ్‌ఎం, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం





మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు

పెయ్యి దూడపై అడవి జంతువుల దాడి

- మరో లేగదూడ, గేదెపైన దాడి
- దాడి చేసిన జంతువును గుర్తించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు

గండేపల్లి: పట్ట పగలే పెయ్యి దూడపై గుర్తు తెలియని అడవి జంతువు దాడిచేసి చర్మాన్ని వలిచి మాంసాన్ని భక్షించడంతో ఆ లేగదూడ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. రెండు రోజుల క్రితం మల్లేపల్లి శివారులో పొలంలో ఉన్న లేగదూడపై దాడిచేసి హతమార్చిన ఘటన మరువకముందే మరోచోట దాడి సంఘటన జరగడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఉప్పలపాడు శివారులో సీతారాంపురం వెళ్లే మార్గంలో మల్లేపల్లికి చెందిన కొత్త శివ పామాయిల్ తోటలో అంకం ఆదినారాయణ తన పశువులను కట్టేసి ఉంచాడు. రోజులానే సోమవారం ఉదయాన్నే పొలంలోకి వెళ్లి పాలు తీసుకుని ఇంటికి వచ్చేశాడు. సుమారు 8 నుంచి 9 గంటల ప్రాంతంలో పొలంలోకి వెళ్లే సరికి లేగదూడను గుర్తు తెలియని అడవి జంతువు తీవ్రంగా గాయపరిచి మరో లేగదూడ, గేదెను స్వల్పంగా గాయపరిచింది. బాధితులు విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియజేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా అటవీశాఖాధికారి ఐకేవీ రాజు గాయపడిన పశువులను, అడవి జంతువులు సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించి పాదముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు తమ పశువులను పొలాలలో ఉంచవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న ఉప్పలపాడు, సీతారాంపురం, రాజుపూడి, తదితర గ్రామాలలో ప్రజలకు విషయాన్ని తెలియజేసి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఘటనా స్థలంలోను, తిరుపతి చెరువు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈయన వెంట వన్యప్రాణి సంరక్షణ సిబ్బంది వరప్రసాద్, ఆర్వో టి.సత్యనారాయణ, ఎస్‌ఓ సిద్ధార్థ్, బీఓలు నూకా సాహేబ్, వీఎస్‌ఎస్ నారాయణ, సంధ్యారాణి, రెడ్డి ఉన్నారు.



అడవి జంతువు సంచరించిన ప్రదేశంలో పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

ఆదిత్య విద్యాసంస్థలకు

రెడ్‌క్రాస్ పురస్కారం



సుగుణారెడ్డికి పురస్కారం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సేవలకు గుర్తింపుగా ఆదిత్య విద్యాసంస్థలను రెడ్‌క్రాస్ పురస్కారం వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డికి అందజేశారు. టర్కీ, సిరియాలలో సంభవించిన భూ కంప సమయంలో ఆదిత్య విద్యాసంస్థలు సమకూర్చిన రూ.48 లక్షల విరాళం రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అప్పట్లో అందజేశారు. అత్యధికంగా 2,200 మంది రక్తదానం చేశారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 13మందికి పురస్కారాలు అందజేయగా కాకినాడ నుంచి ఆదిత్యకు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుగుణారెడ్డిను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

మూడు టన్నుల చేపలు మృతి

- ఆర్‌బీపట్నం రాఘవమ్మ చెరువులో అనుమానాస్పద ఘటన
- మత్స్యశాఖ మంత్రి సిదిరి దృష్టికి తీసుకువెళ్లిన హౌసింగ్ చైర్మన్ దొరబాబు



మృతిచెందిన చేపలను పరిశీలిస్తున్న స్థానికులు

పెద్దాపురం: సుమారు 174 ఎకరాల విస్తీర్ణం కలిగిన చేపల చెరువులో మూడు టన్నుల వరకు చేపలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. చెరువు నీటిని, మృతి చెందిన చేపలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే గ్రామానికి చెందిన రాఘవమ్మ చెరువులో 174 ఎకరాల మేర చేపల సాగును మత్స్యకార సంఘం చేసుకుంటోంది. యథావిధిగా చేపలను పట్టేందుకు సిద్ధమవుతున్న మత్స్యకారులు సొసైటీకి సుమారు 50 టన్నుల చేపలు పట్టాల్సి ఉండగా ఉదయాన్నే చెరువు గట్టుకు వచ్చేసరికి మూడు టన్నుల చేపల అనుమానాస్పద స్థితిలో మృతి చెంది చెరువు గట్టుకు చేరాయి. మత్స్య శాఖాధికారుల అంచనా ప్రకారం వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుంది. విషయం తెలుసుకున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఘటనా స్థలానికి చేరుకుని చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చేపల మృతి కారణాలపై విచారణ జరిపాలని, భారీగా నష్టపోయిన లీజుల దారులకు న్యాయం చేయాలని హౌసింగ్ చైర్మన్ దొరబాబు మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వారికి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. విష ప్రయోగమా? వడదెబ్బ కారణంగా ఏర్పడ్డ ఆక్సిజన్ లోపమా? అనే దానిపై విచారణ జరుపుతున్నామని మత్స్యశాఖాకారి కె.ప్రకాశరావు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

సబ్ జూనియర్ వాలీబాల్ జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక



సబ్ జూనియర్ వాలీబాల్ బాలుర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు



సబ్ జూనియర్ వాలీబాల్ బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు

రావులపాలెం: ఈ నెల 14 తేదీన రాజమహేంద్రవరంలో జరిగే డైరెక్ట్ యూత్ స్టేట్ టీం సెలెక్షన్స్‌లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్స్ వాలీబాల్ జట్లకు 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు తూర్పుగోదావరి వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కుంచే యశ్వంత్ సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఎంపికలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి బాలురు 100 మంది, బాలికలు 70 మంది హాజరయ్యారన్నారు. వీరి నుంచి బాలురలో ఆరుగురిని బాలికల్లో ఆరుగురిని జిల్లా జట్లకు ఎంపిక చేశామన్నారు. ఈ సెలెక్షన్స్‌కు సహాయ సహకారాలు అందించిన పీఈటీ కోట నాగుకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదు

చంద్రబాబుకు రాష్ట్ర హోం మంత్రి వనిత హెచ్చరిక



తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

కొవ్వూరు: రైతుల సమస్యల్ని ఏనాడూ పట్టించుకోని ప్రతిపక్ష నేత చంద్రబాబుకు.. వారి గురించి మాట్లాడే నైతిక హక్కులేదని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత హెచ్చరించారు. 14 ఏళ్ల పాలనలో ఏనాడైనా పంట సీజన్ ముగిసే సమయానికి రైతులకు నష్ట పరిహారం చెల్లించారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాలేనన్న ఫ్రస్టేషన్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సోమవారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముసలి సైకో ఎవరో...పిల్ల సైకో ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. అకాల వర్షాలను ఆసరాగా తీసుకుని రైతుల వద్దకు వెళ్లి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న చంద్రబాబును, లోకేష్‌ను చూసి జనం ఛీకొడుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ఏడాదిలో రైతులకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రెండేళ్లయినా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు సిగ్గులేకుండా తన పాలనలో వారంలోనే ఇచ్చానని చెబుతున్నారన్నారు. రూ.2,500 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టిన చంద్రబాబు పాలనను రైతులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. విత్తన రాయితీ, ధాన్యం కొనుగోలు సొమ్ము, ఇన్‌పుట్ సబ్సిడీతో కలిపి రూ.5,900 కోట్ల మేర రైతులకు ఎగనామం పెట్టిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఆయన ఎన్ని డ్రామాలాడినా రైతులు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రైతులను ఆదుకోవడంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలను మించిన వారెవరూ లేరన్నారు. కరోనా విపత్తు సమయంలో రైతులు, ప్రజా సమస్యలు విస్మరించి హైదరాబాద్‌లోని ఇంద్ర భవనంలో చంద్రబాబు, లోకేష్‌లు పడుకున్నారని విమర్శించారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పునరుద్ఘాటించారు.

తలసేమియా చిన్నారుల ప్రాణాలు కాపాడాలి



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్



రక్తదానం చేస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నగరంలో మెగా రక్తదాన శిబిరం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను రక్తదానం చేసి కాపాడాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా సోమవారం జాంపేట ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణం మండపంలో జైన్ సేవాసమితి, మాగ్నా మదర్‌అండ్ చైల్డ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రక్తదానం చేసి, యువతలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రక్తదానంపై అపోహలు, భయం విడనాడి, మానవత్వంతో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు అవసరమైన బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌కు 50 శాతం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. జైన్ సేవాసమితి అధ్యక్షుడు విక్రమ్ జైన్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది మంది చిన్నారులకు బెంగళూరు మహావీర్ జైన్ హాస్పిటల్లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ త్వరలో జరుగుతుందన్నారు. రక్తదాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌కు వెళుతున్న చిన్నారులకు అతిథులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ శిబిరంలో తలసేమియా అండ్ సికిల్ సెల్ అనీమియా పిల్లలకు డీఎన్‌ఏ మ్యూటేషన్ నిర్ధారణ పరీక్ష, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, చాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, నగర ప్రముఖులు అశోక్ కుమార్ జైన్, బెరూలాల్ జైన్, అనూప్ జైన్, ముప్పన శ్రీను, రాజ్ కటారియా, అశ్విన్ జైన్, బిజేష్ వైష్ణవ్, అమీర్ పాషా, భరత్ రాఘవ్ పాల్గొన్నారు.

2.05 టన్నుల రేషన్ బియ్యం సీజ్

ఆరుగురిపై కేసుల నమోదు



అదుపులోకి తీసుకున్న వారితో విజిలెన్స్ అధికారులు

మండపేట: పట్టణంలోని దిబ్బగరువు వంతెన సమీపంలోని పశువుల మకాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 2.05 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. రామన్నకు చెందిన పశువుల మకాంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్టు విశ్వసనీయంగా అందిన సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించారు. 41 సంచుల్లో ఉన్న 2,050 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండపేటకు చెందిన ఆనంద్‌రెడ్డి, సోమేశ్‌కుమార్‌లు మోటార్ సైకిలిస్టుల నుంచి గుమస్తా బాలసుబ్రహ్మణ్యం ద్వారా కిలో రూ. 20లు చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పెద్దిరెడ్డి సత్యనారాయణ, కావల వీర్రాజు, మతంశెట్టి రామకృష్ణ మోటార్ సైకిళ్లపై పీడీఎస్ బియ్యాన్ని విక్రయించడానికి తీసుకువచ్చారు. మండపేట, ఏడిద పరిసర ప్రాంతాల నుంచి వీరు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇక్కడ అమ్మకాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. నిర్వాహకులతో పాటు బియ్యం తెచ్చిన ముగ్గురు వ్యక్తులపైనా 6ఏ కింద కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.27 లక్షలు ఉంటుందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ ఇన్‌చార్జి కె.కుమార్ తెలిపారు. తనిఖీలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ లోవరాజు, కిషోర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

అనపర్తి: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని మహేంద్రవాడలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఇన్‌చార్జి ఏపీఓ నల్లమిల్లి సూర్య భాస్కరరెడ్డి తెలిపిన వివరాల ఇలా వున్నాయి.

గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో గల బోదె కాలువ పూడికతీత పనులను ఉపాధి కూలీలు చేపడుతున్నారు. సోమవారం పూడికతీత పనులకు హాజరైన గ్రామానికి చెందిన వెలగల సీతారత్నం(77) గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ మల్లిడి గంగారాజు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తమ సంతాపాన్ని ప్రకటించారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన

సామర్లకోట: పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామ పరిపాలనపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ఆయా జిల్లాల్లోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, విస్తరణ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు జూన్ నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అయ్యే శిక్షణలో భాగంగా వారికి శిక్షణ ఇవ్వడానికి ఆయా జిల్లాల్లో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలను మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక చేశామన్నారు.

ఈ దఫా 40 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల నుంచి మాస్టర్ ట్రైనీలు హాజరు అయ్యారు. ఫీల్డు స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని ఎలా పరిష్కరించాలో వారికి వివరిస్తామన్నారు. పంచాయతీ సమావేశాలు, గ్రామసభ కార్యాచరణ కమిటీల ఏర్పాటుపై శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు శిక్షణలో ఈటీసీ ఫ్యాకల్టీలు పి. శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్‌రెడ్డి, కేవీఎస్ఆర్ నిహారిక, బి.ఆంజనేయులు, వి.వెంకటేశ్వర్లు, వి ప్రసాద్ శిక్షణ నిర్వహించారు.